ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
బుధవారం 10 జనవరి 2024



బండి సంజయ్ పోరాట యోధుడు 8
8 పెండింగ్ సమస్యలను వారంలోగా పరిష్కరించాలి



గొర్రెలు వచ్చేనా?

- లబ్ధిదారుల ఎదురుచూపులు
- కొత్త సర్కారుపై ఆశలు
- రెండో విడత గొర్రెల పంపిణీపై నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

'అదిగో గొర్రెలు.. ఇదిగో గొర్రెలు' అంటూ గత బీఆర్ఎస్ సర్కారు గొల్ల కుర్మలకు నిరీక్షణ మిగిల్చింది. గొల్లకుర్మలకు ఆర్థిక చేయూతనందించేందుకు గత ప్రభుత్వం గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. మొదటి విడత ఎట్టకేలకు పంపిణీ చేసినా రెండో విడతలో గొర్రెల కోసం ఎదురు చూస్తూ వస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబరు 30లోగా గొర్రెల పంపణీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం హడావుడి చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాను కేటాయించి అక్కడి నుంచి గొర్రెల యూనిట్లను తెచ్చి పంపిణీ చేపట్టింది. పంపిణీ పూర్తవుతుందనుకున్న దశలోనే ఎన్నికల కోడ్ రావడంతో గొర్రెల పంపిణీకి బ్రేక్ పడింది. కొత్త ప్రభుత్వం రావడంతో గత ప్రభుత్వంలో అర్ధంతరంగా నిలిచిపోయిన గొర్రెల పంపిణీ కొనసాగుతుందో? లేదో? అని లబ్ధిదారుల్లో సందిగ్ధం నెలకొంది.

జిల్లాలో 16,162 మంది లబ్ధిదారుల ఎంపిక

గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధికి గత ప్రభుత్వం గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలోని 190 గొర్రెల సహకార సంఘాల్లోని సభ్యుల్లో రెండు విడతలుగా డ్రా పద్ధతిలో లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. జిల్లాలో రెండు విడతలకు సంబంధించి 16,182 మంది ఎంపికయ్యారు. ఇందులో ఇప్పటి వరకు 12,112 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించారు. గొర్రెల యూనిట్ల కోసం 2017- 2018లో ప్రారంభించిన ఈ పథకం కోసం లబ్ధిదారులు నిరీక్షిస్తూనే ఉన్నారు. గొల్ల కుర్మల ఆందోళనలు వ్యక్తం అవుతున్న దశలో యూనిట్ల పంపిణీ ప్రారంభించడం, మళ్లీ నిలిచిపోవడం పరిపాటిగా మారింది. మొదటి విడత గొర్రెల పంపిణీ ఏదో విధంగా పూర్తి చేసినా రెండో విడత మాత్రం లబ్ధిదారుల సహనాన్ని పరీక్షిస్తూనే ఉన్నారు.

జిల్లాలో మొదటి విడతలో 8137 యూనిట్ల లక్ష్యానికిగా 7517 యూనిట్లను పంపిణీ చేశారు. రెండో విడతలో 8033 యూనిట్ల పంపిణీ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3983 యూనిట్లను పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు 2023 మంది లబ్ధిదారులు తమ వాటాధనాన్ని చెల్లించారు. ఇందులో కేవలం 570 గ్రౌండింగ్ చేసి పంపిణీ చేశారు. సెప్టెంబరులోగా పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అడుగులు వేసినా మళ్లీ నిలిచిపోయింది. వాటాధనం చెల్లించిన లబ్ధిదారులు గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారు. గొర్రెల పంపిణీకి ప్రధానంగా కొరతేనని భావిస్తున్నారు. ఆంధ్రాలోని కర్నూలు, అనంతపూర్ జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో గొర్రెల కోసం అన్వేషించినా దొరకని పరిస్థితి ఉండడంతోనే నత్తనడకగా సాగిందని భావిస్తున్నారు.

గొర్రెల పంపిణీలో అవకతవకలు



జిల్లాలో మొదటి విడత గొర్రెల పంపిణీలో అనేక అవకతవకలు వెలుగు చూశాయి. కడప జిల్లా నుంచి గొర్రెలను తీసుకురావడం మళ్లీ గొర్రెలను ఆంధ్రాకు పంపించడంతో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఆంధ్రా, తెలంగాణల మధ్య గొర్రెలు చక్కర్లు కొట్టాయి. అనేక సందర్భాల్లో గొర్రెలను పట్టుకోవడంతోపాటు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారితో పాటు మండల అధికారి కూడా సస్పెండ్‌కు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని రెండో విడతలో పకడ్బందీగా పంపిణీ చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జియో ట్యాగింగ్‌తోపాటు ప్రతీ గొర్రెకు బీమా సౌకర్యాన్ని కల్పించారు. గొర్రెల కొనుగోలు సమీపంలోని మార్కెట్లను మ్యాపింగ్ చేశారు. ప్రత్యేక కమిటీలు కూడా వేశారు.

75 శాతం రాయితీ

గొర్రెల పంపిణీలో యూనిట్ ధరను గత ప్రభుత్వం పెంచింది. 75 శాతం లబ్ధిదారుడికి రాయితీ లభించనుంది. 25 శాతం డీడీ రూపంలో వాటాధనం చెల్లించాల్సి ఉంటుంది. గతంలోనే జిల్లాలో 190 సొసైటీల్లో 18 సంవత్సరాలు నిండిన గొల్ల కుర్మలను సభ్యులుగా చేర్చుకొని డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. గతంలో ఒక యూనిట్ ధర రూ.1.25 లక్షలు ఉండగా ఇందులో 75 శాతం సబ్సిడీ, 25 శాతం లబ్ధిదారుడి వాటా కింద చెల్లించారు. ప్రస్తుతం యూనిట్ ధరను పెంచారు. రూ.50 వేల వరకు పెంచి 1.75 లక్షలు చేశారు. ఇందులో లబ్ధిదారుడి వాటా 25 శాతం కింద రూ .43,750 చెల్లించాలి. 2023 మంది లబ్ధిదారులు వాటా ధనం చెల్లించి గొర్రెల కోసం నిరీక్షిస్తున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోనరావుపేట, జనవరి 9: తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, రైస్ మిల్లర్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రోజువారి టార్గెట్‌ను చేరుకోవాలని అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్ అన్నారు. మండలంలోని కోనరావుపేట, నిజామాబాద్, మర్తన పేట, కొలనూరు గ్రామాల్లోని రైస్ మిల్లర్లను మంగళ వారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా పాలన సంబంధించిన సమస్యలను దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లు ఎఫ్‌సిఐ కి ఇవ్వాల్సిన రైస్‌ను టార్గెట్ పూర్తి చేయాలని, ఇందుకోసం రైస్ మిల్లులను తనిఖీ చేస్తూ జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు.

ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ కాలయాపన

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

వేములవాడ రూరల్, జనవరి 9: అధికారంలోకి వచ్చిన వంద రోజులలోపు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రజాపాలన పేరుతో దరఖాస్తుల స్వీకరణ, కంప్యూటరీకరణ, క్షేత్రస్థాయి పరిశీలనల వంటివాటితో కాలయాపన చేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మండలంలోని వెంకటాంపల్లిలో మంగళవారం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేని స్థితిలో రాష్ట్రం ఉన్నందున ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్తారో వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయట పడాలన్నా, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రావాలన్నారు. ఆ నిధులు రావాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాజకీయ జెండాలను పక్కనబెట్టి రాష్ట్ర అభివృద్ధి అజెండాగా పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. భారత్‌ను, ప్రధానమంత్రి మోదీని దూషిస్తే ఫలితాలు ఎలా ఉంటాయో మాల్దీవుల ప్రభుత్వానికి రుచి చూపించిన భారత పౌరులకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ, బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్, ఎంపీడీవో రాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, ఐసీడీఎస్ ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూగబోనున్న మరమగ్గాలు

- పరిశ్రమ బంద్‌కు యాజమాన్యాల నిర్ణయం
- ఈ నెల 15 నుంచి బంద్



సిరిసిల్లలో మరమగ్గాలపై పాలిస్టర్ బట్ట ఉత్పత్తి

సిరిసిల్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మరమగ్గం మూగబోనుంది. సంక్రాంతి రోజునుంచే ప్రత్యక్షంగా పరోక్షంగా సిరిసిల్ల వస్త్రోత్పత్తి పరిశ్రమలో ఉపాధి పొందుతున్న 20 వే ల మందికిపైగా కార్మికుల ఉపాధికి దెబ్బ పడనుంది. దేశ వ్యాప్తంగా వస్త్రోత్పత్తి రంగంలో ఏర్పడిన సంక్షోభం సిరిసిల్లపై తీవ్ర ప్రభావం చూపింది. నూలు, రసాయనాల ధరలు పెరగడం, పాలిస్టర్ బట్టకు మార్కెట్‌లో గిరాకీ లేకపోవడం వంటివాటితో సిరిసిల్ల పాలిస్టర్ క్లాత్ మ్యానుఫ్యాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సమావేశ మయ్యారు. ఈ నెల 15 నుంచి సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మరమగ్గాల పరిశ్రమను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి వెల్దండి దేవదాస్ సమక్షంలో అసోసియేషన్ కార్యాలయంలో యాజమాన్యాలు బంద్ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే ఇదే కారణంతో సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు మూసివేశారు. ఈ క్రమంలోనే అతి పెద్ద పరిశ్రమగా ఉన్న సిరిసిల్ల మరమగ్గాలను నిలిపివేయడం ద్వారా కార్మికులు, ఆసాములు వీధిన పడే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఆర్వీఎం, ఇతర ప్రభుత్వ సంస్థల ఆర్డర్లు సిరిసిల్ల పరిశ్రమకు ఇవ్వడంతో ఇబ్బందులు లేకుండా సాగిపోయింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు ముగిసిన తరువాత పాలిస్టర్ బట్ట ఉత్పత్తిని ప్రారంభించినా యజమానులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడం, కొత్త ఉత్పత్తులకు ఆర్డర్లు రాకపోవడం వంటి పరిణామాలతో పరిశ్రమను కొనసాగించే పరిస్థితి లేకుండా పోయింది.

రూ.60 కోట్ల విలువైన బట్ట నిల్వలు

సిరిసిల్ల మరమగ్గాలపై ఉత్పత్తి చేసి గోదాముల్లో పేరుకుపోయిన పాలిస్టర్ బట్ట విలువ రూ.35 కోట్ల వరకు ఉంది. దీంతోపాటు టెక్స్‌టైల్ పార్కులో మరో రూ.25 కోట్ల విలువైన బట్ట ఉంది. హైదరాబాద్, సూరత్, భీవండి, అహ్మదాబాద్ ఇతర రాష్ట్రాల్లో బట్ట కొనుగోళ్లు లేకపోవడం, ఆర్డర్లు రాకపోవడంతపాటు ఉత్పత్తి అయిన బట్ట అమ్మితే మీటరుకు రూ. 2 వరకు నష్టం వాటిళ్లనుంది. ఈ పరిస్థితుల్లో యథావిధిగా బట్ట ఉత్పత్తి చేయలేక నిరవధిక బంద్‌కు నిర్ణయం తీసుకున్నారు.

ఉపాధి కోల్పోనున్న కార్మికులు

ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు సిరిసిల్ల నుంచి బట్ట ఎగుమతులు చేసేవారు. సిరిసిల్లలో 35 వేల మరమగ్గాలు ఉండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. మరమగ్గాలకు అనుబంధంగా సైజింగ్, వార్పిన్ అద్దకం పరిశ్రమల కార్మికులు, హమాలీలకు ఉపాధి లభిస్తోంది. యాజమాన్యాలు వస్త్ర పరిశ్రమ సంక్షోభం పేరుతో పరిశ్రమను నిరవధికంగా మూసి వేయడం ద్వారా మళ్లీ ఆత్మహత్యలు, ఆకలిచావుల వంటి విషాద సంఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రత్యామ్నాయ ఉపాధి చూపేందుకు చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.



సమావేశమైన అసోసియేషన్ ప్రతినిధులు

స్కాలర్‌షిప్‌ల రిజిస్ట్రేషన్‌లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలో 2023 ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన హార్డ్ కాపీలను అందించడంతోపాటు 2024 సంవత్సరానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రీ, పోస్ట్ మెట్రిక్‌ల స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 228 పెండింగ్ హార్డ్ కాపీలను ఈ నెలాఖరులోగా అందించాలన్నారు. 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు ఇప్పటి వరకు 1673 పూర్తయ్యాయని, మిగిలిన రిజిస్ట్రేషన్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అన్నారు. ఎస్సీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ ఎస్సీ అధికారి విజయలక్ష్మి, పర్యవేక్షకుడు అజాం తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దు

- అన్ని నియోజకవర్గాల్లోనూ మెజార్టీ సాధించాలి
- ప్రతి అసెంబ్లీ నియోజకర్గ అభివృద్ధికి పదేసి కోట్లు
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నేతలు

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో మెజార్టీ తీసుకురావడానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి మంగళవారం కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది పార్లమెంట్ స్థానాలను గెల్చుకోవడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతున్నదని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో పార్టీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ఎమ్మెల్యేలు పనులను ప్రతిపాదించాలని, పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకవర్గాల ఇన్‌చార్జిలు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ప్రతిపాదనలు అందజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి అలసత్వాన్ని, అవినీతిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారని సమాచారం. ప్రజలకు సేవలందించడంలో ఎమ్మెల్యేలు ముందుండాలని, ప్రజల్లోనే ఉంటూ వారి మన్ననలు పొందాలని సూచించారు. తాను కూడా వారంలో మూడు రోజులు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను కలుస్తూ వారి నుంచి సమస్యలు తెలుసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

నెలాఖరు నుంచి జిల్లాల వారీగా పర్యటనలు

ఈ నెల చివరి వారం నుంచి జిల్లాలవారీగా పర్యటనలు చేపడతానని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి సభ్యుడు టి జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, కరీంనగర్, హుజూరాబాద్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్, ప్రణవ్‌బాబు, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న కారణంగా మంత్రి శ్రీధర్‌బాబు ఈ సమావేశానికి హాజరుకాలేదని సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి నెల రోజుల పరిపాలనను పూర్తి చేసుకన్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందజేశారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9 : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి పంటకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. లైసెన్స్‌లు కల్గి ఉన్న డీలర్లవద్దనే ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం యూరియా 9462, డీఏపీ 703, కాంప్లెక్స్ 2212, ఎంఓపీ 152 మెట్రిక్ టన్నుల చొప్పున అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఎరువుల డీలర్లకు సూచించామని తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.

బాల సాహితీవేత్త డాక్టర్ రాణీప్రసాద్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో రాణీప్రసాద్

సిరిసిల్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాల సాహితీవేత్త డాక్టర్ రాణీప్రసాద్‌కు మంగళవారం తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు. రాణీప్రసాద్ సాహిత్య రంగంలో సైన్స్‌ను ఉపయోగిస్తూ పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించే దిశగా అనేక పుస్తకాలను వెల్లడించారు. ఇదే క్రమంలో వ్యర్థానికి అర్థం ఉందన్నట్లు తమ సృజన్ హాస్పిటల్‌లో వ్యర్థంగా ఉండే బాటిల్స్, మూతలు, ఇతర వాటితో బొమ్మలను తయారు చేసి ఇప్పటికే రికార్డులను సాధించారు. తాజాగా మన దేశంతోపాటు ఇతర దేశాల్లోని పవ్వులు, ఆకులతో దాదాపు 700కు పైగా చిత్రాలను తయారు చేశారు. చెట్లకొమ్మలు, రెమ్మలతో తయారు చేసిన జంతువుల ఆకృతులకు సంబంధించిన మృగయా పూరీ అనే పుస్తక సంకలనాన్ని వెలువరించారు. పిల్లలను చైతన్యవంతం చేయడంలోనే వెలువరిచిన పుస్తకాలు, ఇతర సృజనాత్మకత ఉట్టిపడే ఆకృతుల తయారీలో రాణీప్రసాద్ 8 జాతీయ, అంతర్జాతీయ రికార్డులను పొందారు. తాజాగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డును అందుకోవడంపై సిరిసిల్లలోని కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి, జనవరి 9: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు షేరో ఆక్టీవిటీలో భాగంగా ముంబాయికి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అధ్వర్యంలో మంగళవారం జీవన నైపుణ్యాలు, స్టీమ్ స్కిల్స్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఈవో రమేశ్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా జెండర్ ఈక్విటి కో ఆర్డినేటర్ పద్మజ, హెచ్‌యూబీ జిల్లా కో ఆర్డినేటర్ రోజా, షేరో ప్రాజెక్టు బృందం గ్రేసి వర్షిత, స్పెషల్ ఆఫీసర్ శ్యామల పాల్గొన్నారు.

తపాల శాఖ ద్వారా ఆన్‌లైన్ సేవలు

సిరిసిల్ల టౌన్, జనవరి 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలతోపాటు ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు తపాల శాఖ అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి దయానంద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆరు గ్యారెంటీల పథకం, రేషన్ కార్డు కోసం దరఖాస్తు, ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, ఇతర ఆధార్ సంబంధిత సేవలను తపాల శాఖలో పొంద వచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన వడ్డీ రేట్లతో తపాల శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలు ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా పరిధిలోని పది డిపార్ట్‌మెంట్ పోస్ట్ ఆఫీస్‌లతోపాటు 87 బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లలో స్పీడ్ పోస్ట్ బుకింగ్, ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్, పోస్టల్ రెవెన్యూ స్టాంప్ సేల్స్ పోస్టల్ ఇన్సూరెన్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

గోదాదేవి కల్యాణోత్సవానికి ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి బాలాలయంలో ఈ నెల 12న నిర్వహించనున్న గోదారంగనాథుల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లో ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ జితేందర్, వైస్ ఛైర్మన్ వెంకటేశ్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్ల రూరల్, జనవరి 9 : సిరిసిల్ల పట్టణంతోపాటు అర్బన్ పరిధిలోని విలీన గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ సుష్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో 220, 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో ట్రాన్స్‌కో మరమ్మతు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్బన్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, చంద్రంపేట, బోనాల, ముష్టిపల్లి, రగుడు గ్రామాలతోపాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆర్అండ్‌బీ డీఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గంబీరావుపేట, జనవరి 9 : ఆర్అండ్‌బీ డీఈ పనితీరుపై గంబీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మంగళవారం కలెక్టర్ అనురాగ్ జయంతికి ఫిర్యాదు చేశారు. లింగన్నపేట పాత బ్రిడ్జి సలాక అక్రమ తరలింపుపై సంబంధిత ఆర్అండ్‌బీ డీఈకి ఫోన్ చేస్తే దురుసుగా మాట్లాడారని పేర్కొన్నారు. ప్రజా సొమ్మును అమ్ముకున్నవారిపై చర్యలు తీసుకోవల్సింది పోయి దురుసుగా సమాధానం చెప్పిన డీఈపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాత బ్రిడ్జి సలాక అక్రమ తరలింపుపై విచారణకు ఆదేశించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాజన్న సన్నిధిలో పూజలు



ప్రదక్షణలు చేస్తున్న యోగేష్ మోహన్ దీక్షిత్

వేములవాడ టౌన్, జనవరి 9 : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (ఎల్‌డబ్ల్యూఈ-2) న్యూఢిల్లీకి చెందిన యోగేష్ మోహన్ దీక్షిత్ మంగళవారం దర్శించుకున్నారు. తాత్కాలిక పర్యటనలో భాగంగా వేములవాడ ఆలయానికి వచ్చిన ఆయన స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, జనవరి9: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 1,195 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామన్నారు. జూబ్లీబస్‌స్టేషన్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్‌కు అదనపు బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు బస్సులకు ఎలాంటి అదనపు చార్జీలు లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను చూడాలని ఆర్ఎం సూచించారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 17 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 9: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారంలో -4, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్‌కేఎన్ఆర్ జగిత్యాల లో-3, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, మూడో సెమిస్టర్‌లో ఎస్‌కె ఎన్ఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జగిత్యాలలో-1, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ముగ్గురు డీబార్ అయినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 9: నగరంలోని ఓ భవనంలో పీఓపీ పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు తెలిపారు. హుస్సేనిపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫరీద్‌ఖాన్(47) సాయినగర్‌లోని రాజాథియేటర్ ఎదుట ఒక భవనంలో పీఓపీ పనులు చేస్తున్న సమయంలో రెండో అంతస్తులోని విద్యుత్ వైర్‌ను మొదటి అంతస్తు నుంచి లాగుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఫరీద్‌ఖాన్ మృతి చెందాడు. మృతుడి కొడుకు లక్కీ ఖాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీపై విచారణ

కరీంనగర్ క్రైం, జనవరి9: కరీంనగర్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోని రికార్డు గదిలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కొన్ని డాక్యుమెంట్లు చోరీ చేసినట్లు అనుమానిస్తున్న ఘటనపై మంగళవారం పోలీసులు విచారణ జరిపారు. సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఒకటో టౌన్ పోలీసులు ఇప్పటికే కార్యాలయ ఉద్యోగుల వేలి ముద్రలను సేకరించగా కొందరు ఉద్యోగుల నుంచి సమాచారం సేకరించారు.

ఇటుకబట్టీలో బాలకార్మికుడు : కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 9: సిరిసిల్ల పట్టణంలోని రగుడు సమీపంలో గల అయ్యప్ప మణికంఠ స్వామి ఇటుక బట్టీ యజమాని జనగామ రాజేశ్వర్ రావుపై మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ ఉపేందర్ తెలిపారు. ఇటుకబట్టీల వద్ద వ్యాన్‌లో ఇటుకలను ఒరిస్సా ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడు లోడు చేస్తుండగా ఆపరేషన్ స్మైల్ రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితి ఎదుట హాజరుపరిచింది. ఈ మేరకు బాలకార్మికుడితో పనిచేయించిన యజమానిపై డిసిపియు ఉద్యోగి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు. ఓ జిన్నింగ్ మిల్లులోనూ బాలకార్మికుడు పనిచే స్తుండగా రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితికి అప్పగించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

చందుర్తి, జనవరి 9: చందుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ వద్ద ఓ వృద్ధుడిని మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నక్క యోసెఫ్ అనే వృద్ధుడు బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్సై అశోక్ చేరుకొని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, జనవరి 9 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దోమ్మాట నాగరాజు, ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన కాసారపు కాశయ్యలు ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట మండలం గోరంటాలలోని బంధువుల వద్దకు వచ్చి, తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సముద్రలింగాపూర్ వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో కాశయ్య తలకు, నాగరాజు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.

వీరిద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గ మధ్యలో కాశయ్య మృతి చెందాడు. నాగరాజుకు కాలు విరిగి చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మహేష్ పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు. .

నేడు వీరభద్రస్వామి కల్యాణం

● హాజరుకానున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ



శ్రీవీరభద్రస్వామి

భీమదేవరపల్లి, జనవరి 9 : కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరగనుంది. స్వామి వారి కల్యాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. స్వామివారి కోనేరు పక్కన గల కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అందజేయనున్నారు. స్వామి వారి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంతో పాటు కల్యాణం జరిగే మండపం వద్ద విద్యుదీకరణ పూర్తి చేశారు. కల్యాణానికి కొత్తకొండతో పాటు ముస్తాఫాపూర్, గట్లనర్సింగాపూర్, ఎర్రబెల్లి, మల్లారం, ముల్కనూర్, భీమదేవరపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు జ్యోతి, కృష్ణవేణి, కృష్ణప్రసాద్ తదితరులకు కల్యాణ ఆహ్వాన పత్రికలు అందజేశామని, వారు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

అదుపు తప్పి ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● ఎగిసిపడిన మంటలు.. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ ● తప్పిన ప్రాణాపాయం



బోల్తాపడి మంటలు అంటుకున్న ఆయిల్ ట్యాంకర్

మెట్‌పల్లి, జనవరి, 9: మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారిపై వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వేకువజామున టైర్ పేలి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్యాంకర్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. మంటల ధాటికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో మంటలు మరింత ఎక్కువయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఆరు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ నుంచి మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామానికి ఆయిల్ ట్యాంకర్ బయలు దేరింది. వేకువజామున పట్టణ శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ట్యాంకర్ టైర్ పేలి బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ ట్యాంకర్ నుంచి దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ట్యాంకర్‌కు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి వెంటనే అగ్నిమాపక, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. మంటలు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకోవడంతో అది పేలి మరింత ఎక్కువయ్యాయి. దీంతో సమీపంలో ఉన్న గు రుకుల పాఠశాల, పెట్రోల్ బంక్‌కు మంటలు అంటుకుని పెద్ద ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాకు ప్రధాన రహదారి కావడంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై చిరంజీవి కోరుట్ల, మల్లాపూర్ ఎస్సైల సహకారంతో వాహనాలను ఇబ్రహీంపట్నంలోని పలు గ్రామాల మీదుగా దారి మళ్లించారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మెట్‌పల్లి పట్టణంతో పాటు చుట్టు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, డీఎఫ్‌వో మురళీ మనోహర్, ఏఎఫ్‌వో భానుప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల పెంపు

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు పెంచారు. ఇప్పటి వరకు మూడు వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా ఆరు వేల క్యూసెక్కులకు పెంపు చేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 66.526 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 8,162 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 502 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, వరద కాలువకు 2 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 155.049 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. యాసంగి పంట నీడి విడుదల ప్రణాళిక ప్రకారం ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కాకతీయ కెనాల్ (ఎల్ఎండీ పైన) జోన్ -2 పరిధిలోని ఆయకట్టు వినియోగం కోసం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని ఎస్సారెస్పీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామడుగు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఈ నెల 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారిణులు ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎస్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

నేడు మానకొండూర్‌కు మంత్రి పొన్నం

మానకొండూర్, జనవరి 9 : రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం మానకొండూర్ మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాలండర్ ఆవిష్కరణ, నిజాయితీగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గంగిపల్లిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, జనవరి 9: నవోదయ విద్యాయలంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతా యారు ఒక ప్రకటనలో తెలి పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 7,105 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఆన్‌లైన్‌లో తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్ టికెట్ డౌన్‌లో డ్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొ న్నారు. దరఖాస్తులో కులం, కేటగిరీ, అర్బన్, రూరల్, పుట్టిన తేదీ, జెండర్ నమోదులో తప్పిదాలు జరిగినట్లయితే అన్ని ఆధారాలతో ఈ నెల 16వ తేదీలోగా తమ విద్యాలయంలో సంప్రదించాలని, నవోదయలో సీటు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల మాట నమ్మి మోసపోవద్దని ఆమె తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

మెట్‌పల్లి, జనవరి 9: మెట్‌పల్లి పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనా రాయణ స్వామి, శ్రీ కాత్యాయని దేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అయలంలో ఏర్పాటు చేయగా సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు.

నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి, శ్రీఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేశారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొ క్కులు తీర్చుకున్నారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బద్దిపోచమ్మకు భక్తుల మొక్కులు



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 9: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామునే అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో శివసత్తుల నృత్యాలతో డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించారు. కళ్లసాకతో పాడి, పంట, పిల్లపాపలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ హరిహరనాథ్ పర్యవేక్షించారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

ఇల్లందకుంట, జనవరి 9: అమాయక ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జమ్మికుంట రూరల్ సీఐ కొరె కిశోర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలంలోని గుండ్లకర్తి గ్రామానికి చెందిన రియాజ్, కుమారస్వామి, సురేష్‌లు స్నేహితులు. వీరు ఒక ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను బెదిరిస్తూ డబ్బులు, ఇవ్వాలని వేదిస్తుండేవారని చెప్పారు. వారి వేధింపులు భరించలేక బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి సురేష్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. ఎవరైనా అమాయక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తే కేసులు తప్పవని సీఐ కిశోర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ రాజకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో పార్కింగ్ ఇబ్బందులు

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలకు సరైన పార్కింగ్ లేక తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. మంగళవారం వందలాది వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలిరాగా కొండపైన, వైజంక్షన్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వై జంక్షన్ వద్ద వాహనాలు ఒకదాని వెనుక మరొకటి చిక్కుకొని ముందుకు వెళ్లడానికి నానా కష్టాలు పడ్డారు. పార్కింగ్, ట్రాఫిక్ జాంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో మహిళ మృతి



మధుప్రియ(ఫైల్)

తంగళ్లపల్లి, జనవరి 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం తాడురులో మంగళవారం పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మల్లైబోయిన మధుప్రియ (28) అనే మహిళా రైతు మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు గ్రామానికి చెందిన రాకేశ్- మధుప్రియ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పొలంలో మధుప్రియతోపాటు మరో ఆరుగురు వరినాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో కర్ర సహాయంతో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌కు వెళ్లే విద్యుత్ వైరు జారి పొలంలో పడింది. అక్కడే వరినాటు వేస్తున్న మధుప్రియ వైర్‌ను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త రాకేశ్, కుమారుడు రిషిత్(8), రిషిత (6) ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిడ్‌మానేరులో భూమి కోల్పోయి పేదరికం అనుభవిస్తున్న కుటుంబంలో ఇల్లాలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా అన్నకూటోత్సవం

కోరుట్ల, జనవరి 9 : పట్టణంలోని అతిపురాతనమైన వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం అన్న కూటోత్సవ (తిరుప్పావడ సేవ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు బీర్నంది నరిసింహాచారి మత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గద్య, విష్ణు సహస్రపారాయణం నిర్వహించి తిరుప్పావై సేవ కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కూటోత్సవ కోసం తయారు చేసిన పులిహోరను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, ఆండాళ్ గోష్ఠి బృంద సభ్యులు పాల్గొన్నారు.



వైభవంగా ప్రత్యేక అలంకరణ

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలు తీసుకెళ్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

తంగళ్లపల్లి, జనవరి 9: తంగళ్లపల్లి మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షింతలను ప్రజాప్రతినిధులు, నాయకులు గడప గడపకు తీసుకెళ్లారు. ఎంపీపీ పడిగెల మానస రాజు, ఎంపీటీసీ కోడి అంతయ్య, స్థానిక సర్పంచ్ అంకారపు అనిత రవీందర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణరెడ్డి, ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, నాయకులు జల్గం ప్రవీణ్, మచ్చ శ్రీనివాస్, గజభీంకర్ సంతోష్, నేరెళ్ల నర్సింగంగౌడ్ పాల్గొన్నారు.

సెస్ చైర్మన్‌కు సన్మానం



చిక్కాల రామారావును సన్మానిస్తున్న ఆలయ నిర్మాణ కమిటీ

తంగళ్లపల్లి, జనవరి 9: సెస్ చైర్మన్ చిక్కాల రామరావును తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్మాణ కమిటీ సభ్యులు గజభీంకర్ రాజన్న, రాపెల్లి ఆనందం, కోడి అంతయ్య, సుద్దాల శ్రీనివాస్, పెద్దూరి తిరుపతి, మచ్చ ఆంజనేయులు, మోర లక్ష్మీరాజం, పగిగెల రాజు, కందుకూరి రామగౌడ్, అంకారపు అనిత, సామల రమేశ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన

ఇల్లంతకుంట, జనవరి 9: బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల ప్రభారి దేవర శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. మూడు నెలలపాటు ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేయాలని సూచించారు. దేశం మొత్తం మోదీ పాలనను కోరుకుంటోందన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, నాయకులు బత్తినిస్వామి, ముత్తవ్వ, భూమల్ల అనీల్, తిప్పారపు శ్రావణ్, శ్రీకాంత్, పున్ని సంపత్, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, చంద్రం, గైని శ్రీనివాస్, శ్రీహరి, లక్ష్మన్, నరేష్, అనీల్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళా నైపుణ్యంలో జాతీయ స్థాయికి ఎంపిక

తంగళ్లపల్లి, జనవరి 9:రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన హస్తకళ నైపుణ్యాల విభాగంలో తంగళ్లపల్లి గిరిజన మహిళా ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని భార్గవి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ నెల 5వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో ప్రతిబ కనబర్చింది. మహారాష్ట్ర నాసిక్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రజని తెలిపారు.

మంత్రి సీతక్కకు సన్మానం

తంగళ్లపల్లి, జనవరి 9: హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను తంగళ్లపల్లి మండలానికి చెందిన నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ నెల 16న చేపట్టనున్న తంగళ్లపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పుర్మాణి లింగారెడ్డి, వైద్య శివప్రసాద్, అంకారపు రవీందర్, బొబ్బల మల్లేశం ఉన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 9: సిరిసిల్ల పట్టణ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలు, పాతబస్టాండ్ ప్రాంతాలలో విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసే ఆకతాయిలపై నిఘా పెంచాలని బీఆర్ ఎస్వీ నాయకులు కోరారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల సమయంలోనూ, పాత బస్టాండ్‌లోనూ సాయంత్రం కొంత మంది ఆకాతాయిలు వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారన్నారు. పోలీస్ శాఖ ఆకతాయిలపై మరి కొంత నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడుతూ షీ టీమ్స్, బ్లూ కోల్ట్స్ గస్తీ పెంచుతామన్నారు. బీఆర్‌ఎస్వీ నాయకులు శ్రీనివాస్, నవీన్, తిరుపతి, జగన్, సందీప్, నరేష్, భాను, కిరణ్ పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం హై ఓల్టేజీ సరఫరాతో ఇళ్లలోని పరికరాలు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా శబ్దం రావడంతో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, మోటార్లు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల ఆస్థి నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. పాత బస్టాండ్ ప్రాంతంలో తరచూ హై వోల్టేజీ విద్యుత్ సరఫరా అవుతుండడంతో వస్తువులు కాలిపోతున్నాయని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు బాలరాజుయాదవ్ సెస్ అధికారులకు వినతి పత్రం అందించారు.

బండి సంజయ్ పోరాట యోధుడు

- మళ్లీ ఎంపీగా గెలిపించాలి
- మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): బండి సంజయ్ పోరాటయోధుడని, భారతదేశమంతా చర్చ జరిగేలా పాదయాత్ర చేసిన నాయకుడని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి సంజయ్‌ను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్‌కు రావడం సంతోషంగా ఉందని, కుటుంబ సభ్యులను కలిసినట్లుగా ఉందన్నారు. తనను అందరూ మేనమామ అంటారని, కరీంనగర్‌కు వచ్చి మీ అందరిని కలిసే భాగ్యం దక్కిందన్నారు. బండి సంజయ్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించనంత మెజారిటీతో గెలిపించి చరిత్ర సృష్టించాలన్నారు. బీజేపీ చరిత్రలో ఇంత వరకు రాష్ట్రమంతా పాదయాత్ర చేసిన నాయకుడు ఎవరూ లేరన్నారు. తెలంగాణలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ పదికి పైగా ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చూపంతా బీజేపీవైపే ఉందన్నారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతానికి పైగా ఓట్లు వచ్చాయని, ఒక్కసీటు నుంచి 8 ఎమ్మెల్యే సీట్లలో గెలిపించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పదికి పైగా సీట్లు సాధించి బీజేపీ సత్తా చాటాలన్నారు. భారత దేశాన్ని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్రమోదీ అవిశ్రాంతంగా పని చేస్తున్నారన్నారు. ఆర్థిక ప్రగతిలో ప్రపంచంలోనే భారత్‌ను ఐదో స్థానానికి చేర్చారన్నారు.



మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

రానున్నరోజుల్లో భారత్‌ను అగ్రభాగాన నిలిపి విశ్వగురువుగా మార్చబోతున్నారన్నారు. ఈనెల 22వ తేదీన దేశమంతా రామయం కాబోతున్నదన్నారు. దివ్యమైన భవ్యమైన రామమందిరాన్ని పునఃప్రతిష్ట చేసుకోబోతున్నామన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బీజేపీ కార్యకర్తల పార్టీ అని, తనకు ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం కల్పించిందన్నారు. ఆడపిల్లలను లక్ష్మిగా భావించి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతోపాటు చదివించే అవకాశం దక్కిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఇంటింటికి మరుగుదొడ్లు, జన్‌ధన్‌ఖాతాలు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు ఇందులో భాగమే అన్నారు. ఒక్కో పోలింగ్ బూత్ అధ్యక్షుడు తనపరిధిలోని బూత్ నుంచి కనీసం 20 మందిని పార్టీ సభ్యులుగా చేర్పించాలన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ సంస్థాగతంగా బలంగాఉంటే గెలుపు సులభమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంగా చేసుకుని అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించారన్నారు. జాతీయ పార్టీ పెట్టి రాజకీయాలు చేసిన బీర్‌ఎస్ చివరకు అక్కడా, ఇక్కడా, ఎక్కడా కాకుండా పోయిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ గల్లీలో, ఢిల్లీలో లేకుండా పోయిందదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ శివరాజ్‌సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్‌లో 18 ఏళ్లకు పైగా సీఎంగా పనిచేసిన గొప్ప నాయకుడన్నారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇంటి దగ్గరకు వెళ్లగానే మామాకా ఘర్ (మేనమామ ఇల్లు) అని కనిపిస్తుందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 1.4 లక్షల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారన్నారు. దీనికంతటికి కారణం ఆయన ప్రవేశపెట్టిన పథకాలే అన్నారు. మధ్యప్రదేశ్‌లో 230స్థానాలుంటే బీజేపీకి 163 స్థానాల్లో గెలిపించారన్నారు. ఏ సర్వేలు చూసినా బీజేపీ గెలిచే స్థానాల్లో కరీంనగర్ మొదటి స్థానంలో ఉందన్నారు. 40 శాతం ఓట్లు బీజేపీ రాబోతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ బండి సంజయ్‌ను గెలిపించి ఢిల్లీకి పంపడానికి శివరాజ్‌సింగ్ చౌహాన్ వచ్చారన్నారు. తెలంగాణలోని రాజకీయ పరిస్థితులన్ని ఆయనకు తెలుసన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ ప్రజల పక్షాన కొట్లాడి జైలుకు వెళ్లిన గొప్ప నాయకుడు బండి సంజయ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల పార్టీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాపరామక్రిష్ణ, దూది శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, జిల్లా ఇన్‌చార్జిలు మీసాల చంద్రయ్య మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను వారంలోగా పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 9 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వారంలోగా పరిష్కరించాలని, ఈ నెలాఖరులోగా కష్టం మిల్లింగ్ లక్ష్యాన్ని పూర్తిచేయడంపై తహసీల్దార్‌లు దృష్టిసారించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎంఆర్ బియ్యం డెలివరీ వేగంవతం, భూముల ఫిర్యాదుల పరిష్కారం, ఓటరు నమోదు దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారత ఆహార సంస్థ (ఎస్‌ఎఫ్‌ఐ)కు రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సిన బియ్యం టార్గెట్‌ను పూర్తి చేయసేందుకు నిత్యం రైస్ మిల్లర్‌లను మానిటరింగ్ చేయాలన్నారు. హైకోర్టు, ఇతర ఉన్నత న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కోర్టు ఆర్డర్ ప్రకారం టైమ్‌లైన్‌లో అర్జీలను పరిష్కరించాలన్నారు. భూములకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఈ అంశంలో ఎల్లారెడ్డిపేట పనితీరు బాగుదని ప్రశంసించారు. కోనరావుపేట మండలంలో అపరిష్కృత అర్జీలు ఎక్కుగా ఉన్నాయన్నారు. అక్కడి తహసీల్దార్‌ను మందలించారు. మీసేవ సర్వీసెస్ పెండింగ్‌పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తంగళ్లపల్లి, కోనరావుపేట, బోయిన్‌పల్లి మండలాల్లో ఆదాయ సర్టిఫికెట్‌లకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పూర్తిచేయాలన్నారు. ఎన్నికలు, ప్రజాపాలన ఇతర కార్యక్రమాలు ఉన్నా రోటిన్ జాబ్‌ను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తంగళ్లపల్లి మండల సర్వేయర్ పనితీరు బాగలేదని, చార్జెస్ ఫ్రేం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌కు సూచించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఫారం 6,7,8 దరఖాస్తుల పరిష్కారంపై దృష్టిపెట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్కాన్ అధికారులకు చేదు అనుభవం

వేములవాడ టౌన్, జనవరి 9: ఛైనర్లను బడిలో చేర్చాలని ప్రత్యేక తనిఖీలు చేస్తున్న ముస్కాన్ అధికారులకు తిప్పాపూర్‌లో చేదు అనుభవం ఎదురైంది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో చిన్నారులను గుర్తించిన అధికారులు వారిని తీసుకువెళ్లేందుకు చూశారు. దీంతో అక్కడే ఉన్న తల్లి వారిని తీసుకువెళ్లేందుకు నిరాకరించింది. ముస్కాన్ అధికారులు వేరే ప్రాంతం నుంచి వలస వచ్చామని, తమ పిల్లలను బడిలో చేర్పిస్తామని గొడవ చేసింది. సుమారు గంటసేపు అధికారులను అడ్డుకోవడంతో చేసేదేమీ లేక అధికారులు బాలురను సిరిసిల్లలోని గురుకులంలో చేర్పించారు.

నేడు కిసాన్ మేళా

జగిత్యాలఅర్బన్, జనవరి 9: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(పొలాస)లో ఈ నెల 10 బుధవారం రోజున కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కిసాన్ మేళా లో రైతులు, శాస్త్రవేత్తల చర్చా గోష్టి ఉంటుందని, దీని లో భాగంగా నూనె గింజల పరిశోధనకు సంబంధించిన దర్శకుడు ఆర్‌కే మయూర్, ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ కు మార్ విశ్వకర్మ, కన్వీనర్ కిషోర్ థాన, డిప్యూటీ సీఈవో రమేష్ హాజరవుతున్నట్లు తెలిపారు. నువ్వుల సాగు ప్రా ముఖ్యతను రైతులకు వివరించడంతో పాటు, ఇతర నూ నెగింజలైన ఆవాలు, కుసుమ, వేరుశనగ, సాగు గురించి వివరిస్తామన్నారు. సుమారు వెయ్యి నుంచి రెండువేల మంది ఈ మేళాకు రైతులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మొగి పురుగు నివారణపై అవగాహన

కొడిమ్యాల, జనవరి 9 : కొడిమ్యాల గ్రామ శివారులో వరి నాటు వేస్తున్న రైతులకు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం బాబు జగ్‌జీవన్‌రాం వ్యవసాయ కళాశా ల జిల్లెలలోని ఫైనల్ ఈయర్ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా మొగి పురుగును గుడ్ల దశలో నివా రించుటకు తీసుకోవాలిసిన జాగ్రత్తల పై రైతులకు అవగాహన కలిపించారు. ఆకు కొన కోత పద్ధతిని

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ఆధునిక వసతులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డీసీహెచ్‌ఎస్ మురళీధర్‌రావు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గర్భిణులకు వైద్య పరీక్షలతోపాటు సర్కారు దవఖానాల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పరీక్షల కోసం 102, కాన్పులకు 108 వాహనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రసవాల కోసం అందుబాటులో ఉన్న ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల, వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. రిస్క్ ఉన్న గర్భిణులకు జిల్లా ఆసుపత్రిలో సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, వ్యాయమాలపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో మొత్తం 57 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు కిరణ్మయి, వైద్యాధికారులు ప్రదీప్, రఘు, శిరీష, ఎంఎల్‌హెచ్‌పీలు మమత, లక్ష్మీప్రసన్న, స్నేహ, స్టాఫ్ నర్సు సునీత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

బీజేపీలో చేరిన రాజేందర్

వేములవాడ రూరల్, జనవరి 9: బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రాజేందర్ మంగళవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాజేందర్‌కు బండి సంజయ్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తిరిగి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

సారంపల్లి పాఠశాల తనిఖీ

తంగళ్లపల్లి, జనవరి 9: తంగళ్లపల్లి మండలం సారంపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ పద్మజ మంగళవారం తనిఖీ చేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా ఉపాధ్యాయుల విద్యా బోధనను పరిశీలించారు. హెచ్‌ఎం ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ
జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

సిరిసిల్ల రూరల్, జనవరి 9: ప్రోగ్రెసీవ్ రికగ్నైజ్‌డ్ టీచర్స్ యూనియన్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులను మంగళవారం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, సత్యనారాయణ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసిన ఫుడ్ కమిషన్ సభ్యుడు

ఇల్లంతకుంట, జనవరి 9: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని రాష్ట్ర ఆహారభద్రతా కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఫుడ్‌కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలను మంత్రికి వివరించినట్లు ఆనంద్ తెలిపారు.

ఆదాయాన్ని కోడెలకు ఖర్చు చేయాలి

వేములవాడ టౌన్, జనవరి 9 : వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో కోడెమొక్కుల ద్వారా వచ్చే ఆధాయాన్ని కోడెల నిర్వహణకే ఖర్చు చేయాలని వీహెచ్‌పీ క్షేత్రం యాదగిరిరావు అన్నారు. రాజన్న ఆలయ గోశాలను మంగళవారం పరిశీలించి ఏఈవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ రాజన్న ఆలయానికి ఏటా కోడెమొక్కుల ద్వారా సుమారు రూ.20 కోట్ల పైబడి ఆదాయం వస్తోందని, గోశాల నిర్వహణకు కనీసం రూ.కోటి ఖర్చు చేయడం లేదని అన్నారు. కోడెలు మృత్యువాత పడిభక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. తెలంగాణ గోరక్షణ అధ్యక్షుడు వెంకన్న, రాధాకృష్ణ, గడప కిషోర్‌రావు తదితరులు ఉన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

జగిత్యాలరూరల్, జనవరి 9 : జగిత్యాల మండలం హస్నాబాద్ శివారులో మంగళవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో నలుగురికి స్వల్పగాయాలు, మహేష్, లక్ష్మీకి తీవ్రగాయాలయ్యాయి. ఆటో ప్రయాణికులను ఎక్కించుకొని జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ నుంచి జగిత్యాల వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది.

రహదారులపై వార సంతలు



గొల్లపల్లిలో రహదారిపై కొనసాగుతున్న వార సంత

- వాహనదారుల ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో రహదారులపై వారసంతలు కొనసాగుతున్నాయి. కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిని ఆనుకొని సంతలు నిర్వహిస్తుండడంతో వాహనదారులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. వార సంతకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు. ఎల్లారెడ్డిపేటలో ప్రతీ శుక్రవారం, గొల్లపల్లిలో ప్రతీ శనివారం, బొప్పాపూర్‌లో ప్రతీ బుధవారం, వెంకటాపూర్‌లో ప్రతీ గురువారం వార సంతలు ఉంటాయి. ఆయా గ్రామాల్లోని బస్టాండు ప్రాంతాల్లో రహదారులపై వార సంతలు నిర్వహిస్తున్నారు. సుమారు 300కు పైగా దుకాణాదారులు, కూరగాయలు, చేపలు, వివిధ రకాల వస్తువులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్‌లో జరిగే సంతలకు చుట్టు పక్కల గ్రామాలైన రాగట్లపల్లి, నారాయణపూర్, సింగారం, దుమాల, హరిదాస్‌నగర్, పదిర, అల్మాస్‌పూర్, అక్కపల్లి, రాజన్నపేట, తిమ్మాపూర్, గుండారం, కోరుట్లపేట, తదితర గ్రామాలకు చెందిన వందల సంఖ్యలో ప్రజలు తరలి వస్తుంటారు. రోడ్డుపైనే సంతలు నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కిక్కిరిసిన జనంతో సంతల లోపలకు వెళ్లేందుకు, కొనుగోలు చేసి తిరిగి వచ్చేందుకు తంటాలు పడుతున్నారు. రోడ్లపైనే సంతలు కొనసాగుతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు పోయిన ఘటనలున్నాయి.

ట్రాఫిక్ సమస్య

ఎల్లారెడ్డిపేట, గొలపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సంతలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పండ్లు, చేపల అమ్మకందారులు కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కనే ఉండి వ్యాపారం చేస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉండే బస్టాండు ప్రాంతాల్లో సంతల నిర్వహణతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పెరుగుతున్న చోరీలు

వార సంతల్లో చోరీలు పెరుగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న వార సంతల్లో జనం అధికంగా ఉండడంతో దొంగలు చేతులకు పని చెబుతున్నారు. కూరగాయలు, పలు వస్తువులు కొనుగోలు చేసే పనిలో నిమగ్నమైన ప్రజల సెల్‌ఫోన్లు, డబ్బులను దొంగలిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు వార సంతలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వార సంతతో ఇబ్బంది

- మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లివాసి



మా ఊరిలో ప్రతీ శనివారం కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారికి ఆనుకొని వారసంతను నిర్వహిస్తుండడంతో ఇబ్బంది అవుతోంది. ఇళ్లకు వెళ్లాలంటే సమస్య ఎదురవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వార సంతకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

వీర్నపల్లి, జనవరి 9 : నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలకమైనవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ట్రాక్టర్స్ యూనియన్, టెంట్ హౌస్ యూనియన్ సహకారంతో గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. నేరాల నియంత్రణతోపాటు పరిశోధనలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. మహిళలకు, ప్రజలకు భద్రత పెరుగుతుందన్నారు. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, 24 గంటలు నిఘా ఉంటుందని అన్నారు. దుకాణాలు, ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

వీర్నపల్లి మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువతతో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి అలవాటు పడినవారి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. డీఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై నవత, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని రవి, ట్రాక్టర్ యూనియన్‌అధ్యక్షుడు పేరం ప్రశాంత్, మాడుగుల చందు, టెంట్ హౌస్ నిర్వాహకులు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ రోడ్డు పక్కనే ప్రమాదకరమైన గుంత

పొంచి ఉన్న ప్రమాదం

గంభీరావుపేట, జనవరి 9 : గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గుంత ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రం నుంచి గొల్లపల్లి మీదుగా సిరిసిల్ల వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న గుంతతో వాహదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.